వన మహోత్సవానికి సిద్ధం

- స్థలాలను గుర్తించిన అధికారులు
- ఉపాధిహామీ కూలీలతో గుంతలు తీయించేందుకు ఏర్పాట్లు

మొగుళ్లపల్లి: వన మహోత్సవానికి అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంది. గత ప్రభుత్వం తెలంగాణకు హరితహారం పేరుతో కార్యక్రమాన్ని చేపట్టగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవం పేరుతో మొక్కలు నాటనుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు పక్కా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఇందు కోసం అవసరమైన మొక్కలను ఇప్పటికే గ్రామాల్లోని నర్సరీల్లో సిద్ధం చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వనమహోత్సవం ప్రారంభానికి ఆయా గ్రామాల్లో మొక్కలు అందుబాటులో ఉంచే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నర్సరీల్లో మొక్కల పెంపకం

మండలంలోని 25 గ్రామాల్లో అధికారులు వన నర్సరీలు ఏర్పాటు చేయించారు. వనమహోత్సవంలో భాగంగా మండలంలో మొత్తం రెండు లక్షల 10 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు ఒక్కో నర్సరీలో 10 వేల మొక్కల చొప్పున మొక్కలు పెంచుతున్నారు. నాటిన అనంతరం కొన్ని మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో కొత్తవి నాటేందుకు అదనంగా పెంచుతున్నారు. ఈ నర్సరీల్లో గ్రామ అవసరాలకు అనుగుణంగా కానుగ, ఉసిరి, వేప, రావి, నల్లమద్ది, చింత, కరివేపాకు, జామ, సీతాఫలం నేరేడు దానిమ్మ, గన్నేరు, గులాబీ తదితర మొక్కలు పెంచెందుకు అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు.


నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

తొలకరి వర్షాలు కురుస్తుండటంతో...

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వన మహత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అవసరమైన స్థలాలను గుర్తించారు. ఉపాధి కూలీలతో గుంతలు తీయించేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో వనసేవకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతిరోజు నర్సరీల్లోనే ఉంటూ పనులు చేయిస్తున్నారు. వనమహోత్సంలో భాగంగా మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. విద్యుత్ వైర్ల కింద మొక్కలు నాటితే అవి ఏపుగా వైర్లకు తాకటంతో వాటిని నరికేస్తున్నారని అలా కాకుండా చూసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామస్తులు సహకరించాలి



వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. ప్రతి నర్సరీలో 10 వేల మొక్కలు పెంచాం ప్రస్తుతం మొక్కలు నాటే దశకు ఎదిగాయి. నాటిన ప్రతి మొక్క బతికేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి గ్రామంలో గ్రామస్తులు, యువత అధికారులకు సహకరించాలి.

– హుస్సేన్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, మొగుళ్లపల్లి

ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలి

కాటారం: కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ భూమిని ఆక్రమించుకున్న కబ్జాదారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని తాజా మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రజావాణి ద్వారా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు రెండు ఎకరాల భూమిని చుట్టు పక్కల గల వ్యక్తులు అక్రమంగా ఆక్రమించుకున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు చీమల సందీప్ ఉన్నారు.


కాటారం: కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

జీఓ నంబర్ 8185 అమలు చేయాలి

భూపాలపల్లి రూరల్: జీఓ నంబర్ 8185 అమలు చేయాలని 61 సంవత్సరాల వీఆర్ఏ వారసుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ చెన్నపురి హరీశ్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి లో కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ... 61 సంవత్సరాలు దాటిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని గత ప్రభుత్వం 8185 జీఓ జారీ చేసిందని అన్నారు. జీఓ జారీ అయి సంవత్సరం కాలం గడుస్తున్న ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. జిల్లా జేఏసీ నాయకులు సురేష్, భూతం రాజు, చెన్నూరు కరుణాకర్, మేనక, లావణ్య, నరసింహులు, మధు, సాయి, వరుణ్ వెంకటేశ్వర్లు, కిరణ్, రాజు, లక్ష్మణ్, భద్రయ్య, సాంబయ్య, సమ్మయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులు కేటాయించాలి

చిట్యాల: మండలంలోని కైలాపూర్ శివారులో గత దళితులకు సంబంధించిన వ్యవసాయ భూములకు హద్దులు కేటాయించాలని మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన దళితులు సోమవారం జిల్లా కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ కాలనీ దళిత రైతులు ఆరెపల్లి నర్సింహారాములు, శనిగరపు మొగిలి, శీలపాక నర్సయ్య, శనిగరపు మధునయ్య, దాసారపు సాంబయ్య, అరెపల్లి సారయ్య, సరిగొమ్ముల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాటారం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం మండలంలో ఓ మోస్తారు వర్షం కురిసింది. శంకరాంపల్లి వద్ద 33 కేవీ విద్యుత్ లైన్‌కు అమర్చిన ఇన్సులేటర్‌పై పిడుగు పడింది. దీంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు, సిబ్బంది స్పందించి మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను సరఫరాను పునరుద్ధరించారు.

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



కాళేశ్వరం: మహదేవపూర్ మండల ప్రత్యేకాధికారిగా జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి నర్సింగరావు మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నర్సింగరావును ఎంపీడీఓ వెంకటేశ్వర్లు శాలువాతో సన్మానించారు. ఆయన వెంట కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ అరుణ్‌యాదవ్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

ఉద్యాన శాఖ డివిజన్ అధికారిగా మణి



భూపాలపల్లి రూరల్: ఉద్యాన శాఖ డివిజన్ అధికారిగా ఎలగందుల మణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉద్యాన పంటలసాగుపై రైతులకు తగు సూచనలు సలహాలు అందిస్తానన్నారు.

పరామర్శ



మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన చిలుకూరి భారతి, సంగ కోమల, కోర్కిశాల గ్రామానికి చెందిన ఓరుగంటి బ్రహ్మం ఇటీవల అనారోగ్య కారణాల వల్ల ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సోమవారం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



మల్హర్: మండలంలో మల్లారం గ్రామానికి చెందిన మంథని సమ్మయ్య తొంటి మార్పిడి సమస్యకి సంబంధించిన అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సహాయం కోసం కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.1.80 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించి మంత్రి శ్రీధర్‌బాబు ఆస్పత్రి సహాయకుడు ద్వారా హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎల్‌ఓసీ పత్రానికి కుటుంబ సభ్యులకు అందజేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


సాంబయ్య (ఫైల్)

రేగొండ: తాటిచెట్టు పైనుంచి జారిపడి ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని కనిపర్తిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనిపర్తి గ్రామానికి చెందిన శ్రీపతి సాంబయ్య (64) కుల వృత్తిలో భాగంగా ఆదివారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

ప్రతీ గ్రామంలో మొక్కలు నాటాలి


మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ వసుమతి

చిట్యాల: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మొక్కలను నాటాలని మండల ప్రత్యేక అధికారిని, అడిషనల్ డీఆర్‌డీఓ వసుమతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఆరు మొక్కలను నాటేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయశ్రీ, ఎంపీఓ రామకృష్ణ, ఏపీఓ హలీం, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి వేడుకలు


కేక్ కట్ చేస్తున్న నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను యువజన కాంగ్రెస్ నాయకుడు పెండల సంతోష్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద కేక్ కట్‌చేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను నాయకులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజబాబు, మండల ప్రధాన కార్యదర్శి మాడుగుల పవన్ శర్మ, ప్రచార కమిటీ అధ్యక్షుడు శకీల్, సీనియర్ నాయకులు సుంకరి సీతయ్య, రవి, యువజన కాంగ్రెస్ నాయకులు మాచర్ల అరుణ్, మైనార్టీ నాయకులు ఫరీద్, పల్లుల గ్రామ శాఖ అధ్యక్షులు మానేం మహేష్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి


మంగపేట: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగపేట: రైతుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు లోడె శ్రీనివాస్, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు జాడి రామరాజునేత ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్ రావుకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులందరికీ బేషరతుగా ప్రభుత్వం రూ.రెండు లక్షల రుణమాఫీ వర్తింపచేయాలన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15,000 అమలు చేయాలని కోరారు. తెలంగాణలో రైతాంగానికీ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను వర్తింపచేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చీకట్ల ఏకస్వామి, జిల్లా కిసాన్ మోర్చా సభ్యులు కృష్ణమూర్తి, దళిత మోర్చా అధ్యక్షుడు సమ్మయ్య, మండల కోశాధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పత్రాలు లేని వాహనాలు కొనొద్దు


టేకుమట్ల: స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపిస్తున్న ఎస్సై ప్రసాద్


గణపురం: వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

టేకుమట్ల: వాహనపత్రాలు లేని ఎలాంటి వాహనాలను కొనుగోలు చేయరాదని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. సోమవారం నంబర్ ప్లేట్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నంబర్ ప్లేట్లు లేని 10 ద్విచక్ర వాహనాలను స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. పట్టణాల్లో కొంత మంది చోరీలకు పాల్పడుతూ ద్విచక్ర వాహనాను అపహరిస్తూ, వాహన పత్రాలు లేకుండా గ్రామాల్లో ప్రజలకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారని అన్నారు. అత్యాశతో తక్కువ ధరకు వాహనం వస్తుందని కొనుగోలు చేస్తే తనిఖీల్లో నిజాలు తెలుస్తాయని అన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనం చోరీకి గురైంది అని తేలితే విక్రయదారు, కొనుగోలుదారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కావున వాహనాలను కొనే ముందు వాహన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి వాహన నంబర్‌తో పాటు, ఇంజిన్ నంబర్, వాహనదారుడి పూర్తి చిరునామాను ఆన్‌లైన్‌లో తనిఖీ చేశాకే కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్సై ఇంతియాజ్, హెడ్ కానిస్టేబుల్ మల్లన్న, కానిస్టేబుల్ సుమన్, నాగరాజు, టీఎస్‌ఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

వాహనాలు సీజ్

గణపురం: మండలకేంద్రంలో ఎస్సై మచ్చ సాంబమూర్తి ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు నెంబర్ ప్లేటు, పేపర్లు లేని వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. నంబర్ ప్లేటు, వాహనాలకు సరైన పత్రాలు లేకున్నా వాహనాలను సీజ్ చేయడంతో పాటు యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నంబర్ ప్లేట్ లేకుంటే చర్యలు

చిట్యాల: నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడిపితే వాహనాన్ని సీజ్ చేసి, వ్యక్తిపై కేసు నమోదు చేస్తామని సీఐ మల్లేష్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో నంబర్ ప్లేట్ లేని 23ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలకు నంబర్ ప్లేట్లను అమర్చుకోవాలన్నారు. ఎస్సైలు శ్రావణ్‌కుమార్, షా-ఖాన్, టీఎస్‌ఎస్పీ కానిస్టేబుళ్లు తదితరులు ఉన్నారు.

పుట్ట మధుకు సన్మానం


మధును సన్మానిస్తున్న నాయకులు

మల్హర్: పెద్దపల్లి జెడ్పీ చైర్మన్‌గా పదవీకాలం ముగిసిన పుట్ట మధును బీఆర్ఎస్ బీఆర్ఎస్ నాయకులు మంథని పట్టణంలో సోమవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్, ఉపాధ్యక్షుడు సంబయ్య, అయ్యూబ్ ఖాన్, సమ్మయ్య పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

పలిమెల: కుల వివక్ష, ఉన్నతాధికారులు, సిబ్బంది వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట ఎస్సై శ్రీనివాస్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని భీం సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఒక అధికారి స్థాయి దళిత బిడ్డకే ఇలా జరిగితే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. ఎస్సై కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మల్హర్: మండలంలోని నాచారం, అమీరబాద్ ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహించి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు నాగరాజు, అలీలను గ్రామస్తులు, యువకులు ఘనంగా సన్మానించారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో పాఠశాలలో 12 సంవత్సారాలు విధులు నిర్వహించిన నాగరాజు, అలీలను గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్, అంగన్‌వాడీ టీచర్లు విజయ, లక్ష్మి, మావురపు వెంకన్న, తాటికొండ రాజయ్య, చేవూరి దేవరాజు, దొగ్గల సంపత్, కర్నూరి అశోక్, కారోబార్ అజ్మీర పాషా, కొట శ్యామ్‌సుందర్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

రేగొండ: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి సామ్యుల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల వద్ద నీరు నిల్వ ఉండకుండా మట్టితో పూడ్చాలని అన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీఓ రాంప్రసాద రావు, సీనియర్ అసిస్టెంట్ సతీష్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ


మహదేవపూర్‌లో దరఖాస్తుల కోసం క్యూలో ఉన్న ప్రజలు



టేకుమట్ల: దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీడీ



మల్హర్: దరఖాస్తు స్వీకరిస్తున్న రాజేందర్

టేకుమట్ల: మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 18 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ విజయలక్ష్మీ తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో భూసమస్యలు కొన్ని కాగా, అంకుషాపూర్ నుంచి గ్రామ పంచాయతీకి సంబంధించిన దరఖాస్తు రాగా సమస్యల పరిష్కారానికి త్వరగా కృషి చేస్తానని ఎంపీఓ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంతోష్‌కుమార్, ఏపీఓ మాధవి ఉన్నారు.

కాటారం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి పలు సమస్యలపై 13 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. పలు శాఖలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు పంపినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపించనున్నట్లు ఆయన తెలిపారు.

కాళేశ్వరం: మహదేవపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 75 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్ తెలిపారు. దరఖాస్తుల పరిష్కారానికి కృషిచేస్తామని పేర్కొన్నారు.

మల్హర్: మండలంలోని తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యాక్రమానికి 13 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. భూ సమస్యలకు సంబందించిన సమస్యలపై 10, కొత్త రేషన్ కార్డుల జారీకి 3 దరఖాస్తులను లబ్ధిదారులు సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరగుతుందని, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాజేందర్ పాల్గొన్నారు.

నేడు ప్రమాద బీమా క్యాంపు

మల్హర్: పోస్టల్ శాఖ ద్వారా ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు మండలంలోని తాడిచర్ల బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్(బీపీఎం) సామ్రిన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు (మంగళవారం) తాడిచర్ల పోస్టల్ కార్యాలయంలో రూ.549తో రూ.10 లక్షల, రూ.749తో 15లక్షల ప్రమాద బీమా చేయడానికి ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 18 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల వయస్సుల గల వారి బీమాకు అర్హులని పేర్కొన్నారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ లబ్ధి పొందవచ్చిని వివరించారు. క్యాంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండ చిలువ పట్టివేత



చిట్యాల: మండలంలోని దూత్‌పల్లి గ్రామంలోని పులి తిరుపతి ఇంటి వద్ద సోమవారం ఏడు అడుగుల కొండచిలువ వచ్చింది. దీంతో స్థానిక ఫారెస్ట్ అధికారులకు గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాగరాజు వచ్చి దానిని పట్టుకున్నారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ.. ఎవరికైనా ఇలాంటి పాములు కనబడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వెంట ఫారెస్ట్ సిబ్బంది శ్రావణ్, సందీప్ గ్రామస్తులు ఉన్నారు.